క్లుప్తంగా

ఘనంగా బోనాలు



బోనాల ఊరేగింపు

యాలాల: ఆషాఢమాసం సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ జరిగింది. ముదిరాజ్ కమ్యూనిటీ భవనం నుంచి భవానీ మాత ఆలయం వరకు డప్పు చప్పుళ్లు, పోతురాజులు విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించారు. ఉత్సవంలో సంఘం అధ్యక్షుడు బాయిమీది అశోక్, ఉపాధ్యక్షుడు బుర్నపురి రాములు, కార్యదర్శి గోనేగారి శ్రీనివాస్, సభ్యులు బుర్నపురి నర్సింహులు, గౌరారపు వెంకటయ్య, రాములు, పట్లా భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాలేసాబ్ ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

యాలాల: నౌషా బాలేసాబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు(మంగళవారం) గంధాలు, రెండవ రోజు(బుధవారం) దీపారాధన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కుల, మత వర్గాలకు అతీతంగా ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

కరుణించవా.. వరుణ దేవా



కప్ప కావడితో రైతులు

కొడంగల్ రూరల్: వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు దాటినా వరుణుడు కరుణించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పత్తి విత్తనాలు నాటేందుకు దాట్లు వేసి సిద్ధంగా ఉంచారు. కందులు వేసేందుకు విత్తనాలు సమకూర్చుకున్నారు. కానీ వానలు పడకపోవడంతో సమయం దాటిపోతుందని చెబుతున్నారు. దీంతో ఆదివారం పలువురు రైతులు కప్ప కావడి పాటలతో ఇంటింటికీ తిరుగుతూ వరుణదేవా కరుణించవా అంటూ వేడుకోగా.. మరికొందరు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, నీటితో అభిషేకం చేశారు.

ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హన్మంతు



నియామకపత్రం అందుకుంటున్న హన్మంతు ముదిరాజ్

పరిగి: ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పరిగి పట్టణానికి చెందిన హన్మంతు ముదిరాజ్‌ను రాష్ట్ర కమిటీ ఆదివారం నియమించింది. ఈ మేరకు తాండూర్ సమ్మేళన కార్యక్రమంలో హన్మంతుకు నియామక పత్రం అందజేశారు. అనంతరం హన్మంత్ మాట్లాడారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని మహారాజ్‌పేట్, గోపులారం, పిల్లిగుండ్ల, ఇరుకుంట తండా, దొంతాన్‌పల్లి గ్రామాల్లో పల్లె పల్లెకు రత్నం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేందుకు పల్లె పల్లెకు రత్నం కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామాల్లో కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింహ, మాజీ సర్పంచ్ శ్రీధర్, కుంటి యాదమ్మ, పిల్లిగుండ్ల ఉప సర్పంచ్ ధరణి ఐలయ్య, శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సంతోష్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు సామయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బయన్న, నర్సింహచారి, శివరాజ్, లక్ష్మణ్ నాయక్, ప్రతాప్‌రెడ్డి, జంగయ్య, చంద్రశేఖర్, విఠల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ఒడిలో.. సర్కారు బడులు

'సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను బోధిస్తున్నాం. ప్రైవేటు బడులు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దు' అంటూ పాలకులు, విద్యాధికారులు ఒక వైపు ప్రచారం చేస్తుండగా.. మరోవైపు సర్కారు విద్యాలయాల్లో సమస్యలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. చదువు, వసతుల సంగతి ఎలా ఉన్నా.. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మొత్తం పాఠశాలల భవనాలే శిథిలా వస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పశువుల కొట్టాలను తలపిస్తున్న పాఠశాలలు
- ప్రైవేటు విద్యాలయాల వైపు మొగ్గుచూపుతున్న విద్యార్థులు



మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న మదనంతపూర్ విద్యాలయం

పెద్దేముల్: సర్కారు బడులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. బీటలు వారిన గోడలు, గదులపై చెట్లు మొలవడం, పెచ్చులూడుతున్న పై కప్పులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. మండలంలో మూడు రోజుల క్రితం కురిసిన చిన్న పాటి వర్షాలకు ఇందూరు, పెద్దేముల్, గిర్మాపూర్, కందనెల్లి, మదనంతపూర్ ప్రాథమిక పాఠశాలతో పాటు మరిన్ని బడుల గదుల్లోకి వర్షపు నీరు చేరి అసౌకర్యంగా మారాయి. అయినప్పటికీ మరో మార్గం లేక ఉపాధ్యాయులు అక్కడే కూర్చొని పాఠాలు బోధించారు. మదనంతపూర్ గ్రామంలో పాఠశాల శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల నుంచి కమ్యూనిటి హాల్‌లో విద్యాభోదన కొనసాగుతోంది.

పరిష్కారం చూపని మనఊరు–మనబడి

గిర్మాపూర్ పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు రెండు గదుల్లోనే కొనసాగుతున్నాయి. పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలల్లో గదులు అనుకున్నంత కంటే ఎక్కువగా ఉన్నా ఒక్క గది కూడా సౌకర్యంగా లేదని, ఈ విషయాన్ని పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లు పలుమార్లు పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు చెప్పారు. పెద్దేముల్, కందనెల్లి బాలుర ఉన్నత పాఠశాలల పరిస్థితి పై వాటిలాగే ఉంది. ప్రభుత్వం మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పడమే తప్పా.. ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదని, కొన్ని బడులు పశువుల కొట్టాలను తలపిస్తున్నాయని పరిసర ప్రాంత ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయమై మండల విద్యాధికారి వెంకటయ్యను వివరణ కోరగా.. పాఠశాలల గదులు అధ్వానంగా ఉన్నది వాస్తవమే అని, అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

గదులున్నా.. అసౌకర్యమే

మండలంలో సుమారు 60 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 5,038 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. గతంలో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడగా.. నేడు గదులు లేక, ఉన్న గదులు శిథిలావస్థకు చేరి పూర్తి అసౌకర్యంగా మారాయి. ఇందూరు ప్రాథమిక పాఠశాల 1నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతుండగా.. అందులో 108 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సుమారు ఆరు నుంచి ఎనిమిది గదులు అవసరం. కానీ అక్కడ తొమ్మిది గదులున్నా.. రెండు వినియోగంలో లేవు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పూర్తి శిథిలావస్థకు చేరింది.



ఇందూరులో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల

కొత్త భవనాలు మంజూరు చేయాలి



మదనంతపూర్ పాఠశాల భవనాలు శితిలావస్థకు చేరి ఐదేళ్లు దాటింది. అయినా కొత్త భవనాలు మంజూరు కావడం లేదు. దీంతో కమ్యూనిటిహాల్‌లో 1నుంచి 5వ తరగతి వరకు విద్యాభోదన జరుగుతోంది. మనఊరు–మనబడి కార్యక్రమంలో భవనాలు మంజూరు కాలేదు. దీంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– గోవర్ధన్‌నాయక్, సర్పంచ్ మదనంతపూర్

సంఖ్య తగ్గుతోంది..



ఇందూరు ప్రాథమిక పాఠశాల భవన స్థితిగతులు చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను పంపించడానికి ఇష్ట పడటం లేదు. దీంతో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాము. చినుకు పడితే కుర్చోవటానికి స్థలం లేదు. రెండేళ్ల క్రితం కట్టిన గదులు చిన్నపాటి జల్లులకే కురుస్తున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కొత్త భవనాలు మంజూరు చేయాలి.

– సంఘమేశ్వర్, హెచ్‌ఎం, ఇందూరు

భీంలీతండాలో..

కొడంగల్ రూరల్: భీంలీతండాలో ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే తరగతి గదులు కురవడమే కాకుండా.. గదుల్లోకి నీరు చేరి, విద్యార్థులు, బోధనా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. శిథిలావస్థకు చేరిన గదులను తొలగించి, నూతనంగా భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.



ప్రాథమిక పాఠశాల భవనం

నేడు ప్రజావాణి

బంట్వారం: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు ఆదివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ధరణికి సంబంధించి సమస్యలు ఉంటే కార్యక్రమంలో దరఖాస్తు చేయాలని, వాటి గురించి రైతులకు వివరించి అవసరమైన వారికి అక్కడికక్కడే మీ సేవా కేంద్రంలో అర్జీ పెట్టిస్తామని వెల్లడించారు.

సర్వసభ్య సమావేశం నేడు

మర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగనుందని ఎంపీపీ బట్టు లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షకు పూర్తి సమాచారంతో మండల స్థాయి అధికారులు రావాలని, అదే విధంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలన్నారు.

నేడు పాంబండ గిరి ప్రదక్షిణ

కుల్కచర్ల: పాంబండ గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలని హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామం శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానం వద్ద సాయంత్రం కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నెలాఖరులో విగ్రహ ప్రతిష్ఠాపన

బొంరాస్‌పేట: మండల కేంద్రం ప్రధాన కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంబేడ్కర్, వివిధ సంఘాల మండల స్థాయి నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ నెల ఆఖరులోగా విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అంబేడ్కర్ సంఘం స్థానిక నాయకులు శ్రీనివాస్, రాములు, అమృతయ్య, బాలయ్య, కిష్టప్ప, బాబయ్య, వెంకటయ్య, మోత్కూర్ శ్రీను, వార్డు సభ్యుడు శ్రీనివాస్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, కవి కళాకారుడు మాసని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కుర్మలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: గొల్ల కుర్మలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పట్టణ శివారు ప్రభుత్వ స్థలంలో కుర్మల ఆత్మ గౌరవ భవనానికి స్థలం కేటాయించి, నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల కుర్మల సంక్షేమానికి పలు సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. రెండో విడతగా గొర్రెలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రా యాదవ్, గొల్ల కుర్మల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మధుసూదన్‌రావ్ యాదవ్, సంఘం నాయకులు మధు, కుర్వ ఎల్లప్ప, మోహన్‌రావ్, పాశం కిష్టప్ప, మణిగిరి రమేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో అన్ని వర్గాలకు మేలు

పెద్దేముల్: ప్రధాని మోదీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులను వివరించి మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోస పూరిత వాగ్దానాలు చేసి ప్రజలను పక్కదోవ పట్టిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు సాయి రవీందర్, గోపాల్, రమేష్, సగార్ సాయి, జనార్దన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

పరిగి: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి బాలకృష్ణారెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రం శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. మోదీ పాలన గురించి వివరించి మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ కీర్తిని విశ్వవ్యాప్తి చేశారని, నేడు ప్రపంచ దేశాలు భారత వైపు చూస్తున్నాయంటే అది మోదీ వల్లే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కేతావత్ శ్రీనివాస్, రాజు, శ్రీను, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆలయ నిర్మాణానికి విరాళాలు

కొడంగల్: బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి గుడి నిర్మాణానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు ఇచ్చారు. పట్టణానికి చెందిన సీబీఐ కోర్టు న్యాయమూర్తి మైత్రేయి ఆమె భర్త న్యాయవాది ఆంజనేయులు రూ.లక్ష, ఆమె సోదరుడు కొడంగల్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ రాఘవేంద్ర యాదవ్ మరో లక్ష రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. దేవాలయ నిర్మాణంలో తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

దోమ: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు అంజిరావన్ అన్నారు. ఆదివారం దోమ మండలం గుండాలలో పురాతన ఎల్లమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఆలయం శిథిలావస్థకు చేరిందని, నూతనంగా నిర్మాణం చేపట్టేలా గ్రామస్తులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రూ.5 వేల విరాళాన్ని ఆయన గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో రామన్నమాదిగ, చెన్నయ్య, దస్తయ్య, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి రసీదు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెరుగు బసంతం నేడు

అనంతగిరి: అనంతగిరి గుట్ట అనంత పద్మనాభ స్వామి ఆలయం ఆషాఢం చిన్నజాతరలో భాగంగా సోమవారం పెరుగు బసంతం నిర్వహిస్తున్నట్లు దేవాలయ ఈవో నరేందర్, ట్రస్టీ పద్మనాభం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామి వారి గరుడ వాహన సేవ అనంతరం పెరుగు సబసంతం నిర్వహిస్తామని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

క్రీడలతో యువతకు ఉపాధి



క్రీడాకారులతో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

నవాబుపేట: క్రీడలతో యువతకు మానసిక ప్రశాంతతతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పులుమామిడి ఎంపీటీసీ తేజశ్విని ఆధ్వర్యంలో వారం రోజులుగా మండల స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో లింగంపల్లి గ్రామానికి మొదటి బహుమతి, పులుమామిడికి రెండో బహుమతి లభించింది. గెలుపొందిన జట్లకు.. కేఎస్ రత్నం ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10లు అందజేసి మాట్లాడారు. చదువుతో పాటు.. ఆటల్లోనూ రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్‌గౌస్, నర్సింహులు, పాండురంగారెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు ఏకమవ్వాలి



నూతన కమిటీతో నర్మద

బొంరాస్‌పేట: బహుజనులంతా ఏకమవ్వాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద అన్నారు. ఆదివారం ఆ పార్టీ దుద్యాల మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలంతా ఏకమై రాజ్యాధికారం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు.

మండల కమిటీ ఏర్పాటు

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా ఉష్కాచారి, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శివగారి అంజి, కార్యదర్శులుగా రహల్, జోగి వెంకటయ్య తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దౌల్తాబాద్‌లో వర్షం

దౌల్తాబాద్: వాన కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం పులకరింపజేసింది. సాయంత్రం సుమారు అరగంటకు పైగా భారీ వర్షం పడింది. దీంతో ఇప్పటి వరకు విత్తనాలు వేయని రైతులంతా.. సోమవారం నుంచి పొలాల బాట పట్టనున్నారు.

వేగంగా 'ఆయూష్' నిర్మాణ పనులు

అనంతగిరి: అనంతగిరి గుట్టలో ప్రభుత్వ ఆయూష్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 13న రూ.15 కోట్లతో వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు పిల్లర్ల దశలో ఉన్నాయి. అనంతగిరి గుట్ట వనమూలికలకు ప్రసిద్ధి గాంచింది. ఇలాంటి ప్రదేశంలో ఆయూష్ ఆస్పత్రి నిర్మాణం చేపట్టడం పట్ల పలువురు హర్ష వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో 50 పడకల ఆసుపత్రిలో ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి తదితర విభాగాలు ఇక్కడ ఉంటాయి.

తెలంగాణలో మూడు..

రాష్ట్రానికి మొత్తం 3 ఆయూష్ ఆసుపత్రులు మంజూరు కాగా.. అందులో ఒకటి అనంతగిరిలో ఏర్పాటు చేస్తున్నట్లు శంకుస్థాపన సమయంలో మంత్రి హరీశ్ చెప్పారు. అనంతగిరి అటవీ ప్రాంతానికి రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతులు కలిగి ఉందని, ఇక్కడ అనేక ఔషధ మొక్కలు ఉండడంతో ఆయూష్ ఆసుపత్రి ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వెల్లడించారు.




పిల్లర్ల దశలో ఆసుపత్రి భవనం

గడువులోగా పూర్తి

ఆయూష్ ఆసుపత్రి నిర్మాణం నిర్ణీత (9 నెలలు) గడువులోగా పూర్తయ్యేలా చొరవ తీసుకుంటున్నాం. అందుకు సంబంధించిన పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఇప్పటికే పిల్లర్ల దశలో నిర్మాణం ఉంది. – లక్ష్మయ్య, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ, డీఈ

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



నిలిచిపోయిన మద్వాపూర్ అంగన్‌వాడీ భవన నిర్మాణం

బంట్వారం: అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులు నిలిచిపోయి దశాబ్ద కాలంగా మొండి గోడలతో దర్శనమిస్తున్నా.. సంబంధిత ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్వాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులు జెడ్పీ నుంచి మంజూరయ్యాయి. నాడు పనులు చేపట్టిన గుత్తేదారు.. లెంటల్ లెవల్లోనే పనులను నిలిపి వేశారు. ఏళ్ల తరబడి పనులు పూర్తికాకపోవడంతో ఇటుక గోడల్లో మొక్కలు మొలిచి, ఏపుగా పెరుగుతున్నాయి. అయినప్పటికీ పనులు ప్రారంభించే దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నాటి నుంచి పాఠశాల భవనంలో కొనసాగుతోంది. పదేళ్ల కిందటే నిధులు మంజూరైనప్పటికీ పనులు మధ్యలో నిలిపి వేశారని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే నిర్మాణ పనులు చేపట్టి, భవనం వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దశాబ్దకాలంగా నిలిచిన పనులు

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రతీ పంచాయతీకి పదివేల మొక్కలు

కొందుర్గు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీలో 10 వేల మొక్కలు పెంచుతున్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని 22 పంచాయతీలకు గాను 2.20 లక్షల మొక్కలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని 24 గ్రామపంచాయతీలకు 2.40 లక్షల మొక్కలను ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు. నర్సరీలలో మొక్కలు ఏపుగా పెరిగేందుకు వన సేవక్‌లు క్రమం తప్పకుండా నీళ్లు పట్టడంతోపాటు, గడ్డి మొక్కలు లేకుండా చూడాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి.

నాటేందుకు సిద్ధంగా మొక్కలు

ఈ నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలు వేప, కానుగ, టేకు, మునగ, అల్ల నేరేడు, చింతతోపాటు పూల మొక్కలు గులాబీ, మందారం మొక్కలను పెంచుతున్నారు. కొందుర్గు మండలంలోని లక్ష్మీదేవిపల్లి, చిన్నఎల్కిచర్ల, మహదేవ్‌పూర్, ఆగిర్యాల, తంగెళ్లపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ, పద్మారం, ధర్మానాయక్‌తండా, వాచ్యాతండా, ఎదిర గుంజల్‌పహాడ్ గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఈ మొక్కలను వర్షాలు కురిసిన వెంటనే నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



కొందుర్గు నర్సరీలో మొక్కలకు నీరు పడుతున్న వనసేవక్

విద్యుత్ వైర్లకింద నాటొద్దు



నాటిన ప్రతి మొక్కను బతికించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మొక్కలను రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. చేయిచేయి కలిపితేనే చెట్లను పెంచడం సాధ్యం. చెట్టు ఉంటేనే జీవరాశి మనుగడ సాధ్యం. మొక్కలను సాధ్యమైనంత వరకు మొక్కలను విద్యుత్ వైర్ల కింద నాటకుండా చూడాలి. – ఆంజనేయులు, ఎంపీడీఓ, కొందుర్గు